# మేమందరం హాయిగా ఇంకో వూరికి-ఏలూరికి

**మా**కు రేపట్నించి క్రిస్మస్ సెలవలు. ఈవేళ మదర్ సుపీరియర్ అన్ని క్లాసుల్లో ఫస్టు సెకండు వచ్చిన పిల్లలకి సాయంగా పువ్వులతికించిన ప్రోగ్రెసు కార్డులిస్తారు. చప్పట్లు కొట్టిస్తారు.

ఇంక మాలాటి వాళ్లం టీచరు దగ్గర కార్డులు తీసుకుని మేవే పువ్వులతికించుకోవాలి. అన్ని పేపర్ల లోనూ మార్కులోసారి వేశాక బాడ్‌హేండ్ రైటింగని ఐదేసి మార్కులు తీసేస్తారు కాబట్టి నే చచ్చినా ఫస్టొచ్చే ఛాన్సు లేదు.

కానీ మదర్ దగ్గర గ్రీటింగ్ కార్డు అందుకోవాలంటే ఇంకో వుపాయం వుందిలే. అదేవిటంటే పాత బట్టలు గానీ, దుప్పట్లు గానీ, స్వెట్టర్లు గానీ ఎక్కువగా పోగుచేసి తీసికెళ్లి కాన్వెంటు సిస్టరుకివ్వాలి. అందరికన్నా చాలా తెచ్చిన పిల్లలకి మదర్ మెర్రీక్రిస్మస్ చెప్పి గ్రీటింగు కార్డిస్తారు. ఒక్క మా ఇంట్లోవే అయితే తక్కువగా కనపడతాయని హరే రామా వాళ్ళింట్లోనూ, ప్లీడరు గారింట్లోనూ, మామీ వాళ్ళింట్లోనూ కూడా కొన్ని అడిగి తెచ్చా. పాపక్కా, ప్రమోదక్కా మాత్రం వాళ్లింటికొస్తే చంపేస్తామన్నారు. మావి మేం ఇచ్చుకోగలంలే నీ సాయం ఏం అక్కర్లా అని కూడా అన్నారు. హు! వాళ్లింట్లోవి వాళ్లిచ్చుకోవాల్సిందే, నాలా ఇంకోళ్లని అడిగి తెమ్మను చూద్దాం! ఈ పాతబట్టలన్నీ సిస్టర్లు పేదలకి పంచుతారన్నమాట.

ఎవరో వీధిలో ఎర్ర సైకిలు దిగుతున్నాడు. ఎవరబ్బా అనుకుంటూ వాకిట్లోకి పరిగెత్తా.

''పాపా! ఇది వెంకటేశ్వర్రావు గారిల్లేనా''

''కాదండీ! సీతారామయ్య గారిల్లు'', ఎవరిల్లో పట్టుకుని మనదంటే బాగుండదు కదా. మరి ఇంటి నెంబరు అదే వుందే ఆ సైకిలబ్బాయడిగాడు. ''అంటే వెంకటేశ్వర్రావు గారు మా నాన్నగారు. మేం వూరికే అద్దెకుంటున్నాం, అంతే. ఇది మా ఇల్లెలా అవుతుంది? ఎర్రసైకిలంటే టెలిగ్రాం వచ్చిందా ఇంతకీ ఎవరు చచ్చిపోయారు?''

అతను చదవడం మొదలెట్టాడు- సామినాదన్ గారనీ...

''అయ్యోపాపం! మొన్ననేగా వూరెళ్లారూ! ఇంత తొరగా చచ్చిపోయారా''

''ఓర్నా తల్లోయ్! తప్పు తప్పు! ఆయనేం చచ్చిపోలేదు. మీ నాన్నగార్కి ఏలూరు ట్రాన్సఫరయిందనీ ఎల్లుండి లోపల జాయినవమనీ టెలిగ్రాం ఇచ్చారు.'' అన్జెప్పి వాడు సైకిలెక్కి వుడాయించాడు ఆ కాయితం నా చేతిలో పెట్టి. ''అమ్మా! ఇటు చూడు! టెలిగ్రాం! మనకి ట్రాన్స్ఫరయి పోయిందీ! ఏలూరెళ్లి పోవాలీ! ఎల్లుండే వెళ్లాలి!'' అని పాడు



కుంటూ పరుగెత్తుకుంటూ వెళ్లి అమ్మకి కాయితం ఇచ్చేశా! ''వచ్చిందీ శ్రీముఖం! అనుకుంటూనే వున్నా మూటా ముల్లె సర్దాలని. ఏలూరులో అమెరికనాస్పత్రి పనొచ్చుంటుంది కంపెనీకి. ఏం నీ వళ్లో వొరిగిపడిందని అలా గెంతుతున్నావు? పని మీది వెళ్లి నాన్నని కేకేసుకురా, అమ్మ రమ్మంటోందని చెప్పు. టెలిగ్రాం సంగతి చెప్పకు'' క్షణంలో పరిగెత్తుకుంటూ వెళ్లి జీపులో నాన్నతో కలిసి వచ్చేశా.

నా కంతా రోజుకో హడావిడిగా కొత్తరకంగా వుంటే ఎంతిష్టవో చెప్పలేను. రోజూ సోదిలా ఒకేలా వుంటే ఏం బాగుంటుందీ. ట్రాన్స్ఫరంటే ఎంత మజా! కొత్తవూరు, కొత్త స్కూలు. కొత్త టీచర్లు. కానీ అమ్మకి విసుక్కోవడం తప్ప ఏవీ తెలీదు. నే సంతోషిస్తే కూడా చూడలేదు.

''ఇదిగో టెలిగ్రాం. మనకీ గుంటూరు నీళ్లకీ ఋణం తీరిపోయింది. కనీసం పిల్లల పెద్ద పరీక్ష లయేవరకయినా వుండనిస్తారేమోనని ఆశపడ్డా! అన్నట్లు రేపట్నించీ వీళ్ల స్కూలు సెలవలు. టిసిలు కావాలని వుత్తరం రాసియ్యండి నానీ చేతికి'' అన్చెప్పి అమ్మ లోపలికెళ్లిపోయింది.

నాన్న రాయడం మొదలెట్టారు. ''నానీ! నువ్వే క్లాసే''

''మీరెక్కడ దొరికారు నాన్నా నాకు! నేనే క్లాసో కూడా తెలియని నాన్నవి! ఫోర్త్-బి, అని రాయండి.''

''ఇంకా నీ పని నయమే! క్లాసొక్కటే తెలియదు. నాదయితే పేరు కూడా తెలియదు'' చిన్నారి నవ్వడం మొదలెట్టింది.

''నీ పేరెందుకు తెలియదు పద్మిని సెకండ్-ఎ సెక్షన్.'' నాన్న మహా గొప్పగా చెప్పారు.

''అయ్యో పిచ్చి నాన్నా! పద్మిని పెద్ద నాన్న గారమ్మాయి పేరు, నా పేరు పద్మ సెకండ్-బి,'' చిన్నారి మళ్లీ నవ్వడం ఇంతలోకి మళ్లీ అమ్మొచ్చి 'చాలు వెకిలి నవ్వులు! అవసరం పడితే డబ్బు కట్టండి. ఎంతాలీసమైనా అందరు టీచర్లకీ చెప్పి టిసిలు తీసుకునే రండ' ని పది రూపాయలిచ్చి లక్షాతొంభయ్యారు ఆర్డర్లేసి పంపింది. పెద్ద బట్టల మూటుంది కదాని డ్రైవరు చేత మమ్మల్ని స్కూల్లో దిగబెట్టించేశారు నాన్న. గేటు దగ్గర జీపు దిగి ఆ మూట ఈడ్చుకుంటూ ఆఫీసు సిస్టరు దగ్గర కెళ్లాం.

మేం తెచ్చినవి చూసి ఆవిడ ''చాలా కలెక్ట్ చేసి తెచ్చారే. మంచి పిల్లలు! మిమ్మల్ని ప్రభువు చల్లగా చూస్తాడు'' అంటూ ఆ మూట తీసుకున్నారు.

''ఏం చూస్తాడు సిస్టర్! మిమ్మల్నందర్నీ వదిలి వెళ్లిపొమ్మంటున్నాడు ప్రభువు. మా నాన్నగారికి

ఏలూరు ట్రాన్స్‌ఫరయి పోయింది. టిసి లిప్పించండి'' అని వుత్తరం ఇచ్చాను. ఆవిడ నాన్న ఉత్తరం చదివారు ''అన్ని వూళ్ళూ తిరిగితే మీకు చాలా మంది స్నేహితులొస్తారు కదా! ఎన్నో విషయాలు తెలుస్తాయి కదా! అదే ప్రభువు ఆశీర్వాదమన్న మాట. మీరు భోజనాల బెల్లులో రండి. టిసి లిస్తాను'' అన్నారు. భోజనాల బెల్లులో మదర్ మా ఇద్దర్నీ తన రూంలోకి పిలిచారు ''మీరిద్దరూ మంచి పిల్లలు. ఎక్కడున్నా అందరిపట్లా స్నేహంగా దయగా వుండి మన స్కూలుకి పేరు తేవాలి. పెద్దలని గౌరవించాలి. టిసిలతో పాటు ఏలూరు కాన్వెంటు మదర్‌కి కూడా వుత్తరం ఇస్తున్నాను. అక్కడా ఇవే పుస్తకాలు కాబట్టి మీ నాన్నగారిని మిమ్మల్నదే స్కూల్లో చేర్చమని చెప్పండి'' అని చెప్తూ మా ఇద్దరికీ మంచి గ్రీటింగు కార్డులిచ్చారు.

ఆవిడ మమ్మల్ని మంచి పిల్లలన్నందుకు గొప్పగా అనిపించినా అందర్నీ వదిలేసి వెళ్ళిపోవాలంటే ఎంత బెంగొచ్చిందో! కొందరు టీచర్లని మళ్ళీ చూడననుకుంటే నాకు బోల్డు ఏడుపొచ్చేసింది. మళ్ళీ చూద్దామని సెంటూరొచ్చిన టిసిలు తీసుకున్న పిల్లల్ని లోపలికి రానిస్తారో! రానియ్యరో! కానీ మేం ఎంచక్కా ఏలూరెళ్ళిపోతున్నావని కొందరు కుళ్ళు మొహాలు ఎంత ఏడ్చుకున్నారో! ''మీకేవే! అదృష్టవంతులు. మీ నాన్నది ట్రాన్స్ఫర్ల ఉద్యోగం కాబట్టి అన్ని వూళ్ళూ తిరగొచ్చు. ఎన్నో ఇళ్ళలో వుండొచ్చు. మాకయితే చచ్చేదాకా ఒకటే బడి! ఒకటే ఇల్లు! మా నాన్నలకి ట్రాన్స్ఫర్లే వుండవు'' అని!

ఎంత ఆశో! ట్రాన్స్ఫర్లందరికీ అవమంటే అవుతాయా కనీసం చిన్నింజనీరన్నా అవాలి కదా. ఇంకా పాపక్కా ప్రమోదక్కా వాళ్ళకయితే విసుగొచ్చేలా చచ్చేంత డబ్బు! వూరికే బియ్యం బస్తాలు హాలులో పెట్టుకోడం, వండుకు తినడం ఇంకెవ్వరికీ ఏ పనీ వుండదు.

తెల్లారితే సెలవులు. ఎలాగూ మేం వూరెళ్ళిపోతున్నాం కదాని అందరూ కలిసి 'నా ఇల్లు' సినిమా చూసొచ్చాం. సరిగ్గా నాన్న ప్రయాణమవుతుంటే గుర్తుకొచ్చి అడిగా ''మీరొక్కరే వెడుతున్నారా నాన్నా రైల్లో!''

''అవునురా! ఏం, వారం రోజుల్లో ఇల్లు కుదుర్చుకొచ్చి మీ అందర్నీ తీసికెడతాగా'' అన్నారు.

''కాదు నాన్నా! నిన్న సినిమాలో లాగా ఏవైనా అయి మీకు మతిపోతే మనం మళ్ళీ మేం పెద్దయ్యాక కలుసుకుంటే మమ్మల్నెలా గుర్తు పడతారూ అందుకని 'అదిగదిగో గగనసీమ' గుర్తుపెట్టుకోండి.

ఆ పాట పాడితే మేం గుర్తొస్తాం'' అన్నా. అంతే ఇంక చూసుకో! అమ్మ బాదిందీ విసినకర్రతో నన్ను. అడ్డం వచ్చిన నాన్నకూ కూడా తగిలాయి. ముందు జాగర్తగా నేనేం చెప్పినా నేను శకున పక్షిలా కనిపిస్తానావిడగారికి! అదీ నే చేసుకున్న పుణ్యం. పుంగోణం చేత అన్ని సామాన్లు పాక్ చేయించుకోమని చెప్పి నాన్న ఏలూరెళ్ళిపోయారు మా టీసిలు తీసుకుని.

మంచాల నవార్లన్నీ విప్పి సోడాలో వుడకపెట్టించి వుతికి ఆరేయించి వుండలుండలుగా చుట్టించింది అమ్మ. నాడు మంచాలు కాంప్‌కాట్‌లు కాళ్ళకికాళ్ళు విడగొట్టి గోనె పట్టాలో వేసి చిన్న శాల్తీలా చేసేశాడు. అందులోంచి ఆరు మంచాలొస్తాయంటే ఎవరూ నమ్మరు. మడత కుర్చీలు కూడా అలాగే నాలుగు కలిపి కుట్టేశాడు. పెద్ద బియ్యం డ్రమ్ములో చిన్న చిన్న సామాన్లన్నీ వేసి ఆ డ్రమ్ము కూడా కుట్టేశాడు. అలమరలో వున్న బొమ్మలన్నీ పాత పేపర్లతో



చుట్టి మంచం కింద వుండే నల్ల పెట్టెలో పెట్టాడు. చూస్తుండగానే ఇల్లంతా గోనె పట్టాల్లోకీ. డ్రమ్ముల్లోకీ పెట్టెల్లోకీ వెళ్ళిపోయింది. అమ్మ ఒక్క కుంపటి, రెండు గిన్నెలు, మూకుడు, నాలుగు గ్లాసులు మాత్రం ఇవతలుంచింది. అడ్డకుల్లో అన్నాలు అంటే ఎంత సరదాగా వుంటుందో మధ్యమధ్యలో పుల్లలేరుకుంటూ. మరి మా అమ్మకెందుకు తోచలేదో ఇన్నాళ్ళూ.

పాపం ఇల్లుగల తాతగారూ అమ్మమ్మగారూ ''ఏవే ఇల్లేరూ! నువ్వు లేపోతే ఈ వీధిలో వాళ్ళ అజ ఎవరు కనుక్కుంటారే. అసలు నీకు మేం గుర్తుంటామా? నీకేం అడవిలో పడేసినా కాలక్షేపం చేసి వస్తావ్'' అని రోజూ అడిగేవాళ్ళు.

అమ్మేమో ''పిన్నిగారూ! మీ ఇద్దర్నీ వదిలి వెళ్ళాలంటే ఎంత బెంగగా వుందో! అచ్చం మా అమ్మా నాన్నగారి దగ్గిరున్నట్టే నిశ్చింతగా వున్నానిన్నాళ్ళూ! కొత్త వూళ్ళో ఎలా వుంటామో! అందరూ మీలా వుండరు కదా'' బాధ పడింది.

''నానీ! నాకు నల్లే గారెలు నేతిలో చెయ్యమని రోజూ మీ అమ్మతో పోట్లాడేదానివిగా! ఇవిగో మీ అందరికోసం చేశా''నని పెద్ద బేసిన్డు గారెలు తెచ్చి మా ఇంట్లో పెట్టి వెళ్ళిపోయారు. అవి ఎంత బాగున్నాయో! కానీ అమ్మ ఒక్కటి కూడా తినలా. నేతిలో గారెలు వేయించడవేవిటీ మొగటొచ్చేలా అన్చెప్పి! అదీ మనమంచికేలే! కొన్నయినా కొందరికి నచ్చకపోతేనే కదా ఎవరన్నా ఇచ్చినవి మనం మనసుతీరా తినేది!

నాలుగు రోజులకే నాన్న వచ్చేశారు ఇల్లదీ కుదుర్చుకుని. జీపుని కూడా ఏలూరు తీసికెళ్ళిపొమ్మన్నారుట. మరి సామినాథన్ గారిని మద్రాసే పేశారుగా! ఇంక ఏలూర్లో నాన్నే సామినాథన్ నన్నమాట.

ఇంక నాన్నొచ్చాక ఆ మిగిలిన గిన్నెలు కూడా మూట కట్టేసి పూటకోళ్ళింట్లో భోజనాలు. అమ్మకయితే వుత్త జాకెట్టు బట్టలు పసుపుకొమ్ములేగానీ నాకెన్ని రకాల ప్రెజెంట్లొచ్చాయో! హరేరామా తాతగారు పెద్ద రామపట్టాభిషేకం ఫొటో, పాపక్కావాళ్ళు ఇంగ్లీషు గ్రామరు పుస్తకం, ప్రమోదక్కవాళ్ళు కారెమ్స్ బోర్డు- ఇలా. దీని సామానుకే జీపు చాలేట్టు లేదని అప్పుడూ అమ్మ తిట్లే నాకు.

మూడింటివరకు వర్జం వుందని మేం సామాన్లన్నీ సర్దేసుకుని రెడీ అయిపోయినా బయల్దేరనియ్యలేదు అమ్మమ్మగారు. పొద్దుట్నుంచీ కళ్ళు తుడుచుకోడవే! అన్నం కూడా సయించలేదుట ఆవిడకి. అమ్మతో బాటు మా నలుగురికీ కూడా బొట్లు పెట్టి అరటిపళ్ళు ఇచ్చారు.

జీపుదాకా బుజ్జి నెత్తుకు వచ్చి ''పాండే దొంగ మొహాల్లారా! ఏ బంధాలూ లేకుండా బతకమని భగవంతుడు మమ్మల్ని పుట్టిస్తే మీమీద మమకారం పెట్టుకోమని మాకెవరు చెప్పారు'' అంటూ చివ్వరిసారిగా మమ్మల్ని కోప్పడి జీపెక్కించేశారు అమ్మమ్మగారు.

**–సోమరాజు సుశీల**